# అశక్యం

పెళ్ళిపందిరి కళకళలాడుతోంది. మంగళ వాద్యాలు మార్మోగుతున్నాయి. శుభ ముహూర్తంలో మాంగల్యధారణ జరిగింది. కూతురి పెళ్ళి హడావిడిలో మునిగిఉన్నా మాటి మాటికీ తలుపువైపు చూస్తున్న సత్యవతి నిరాశతో క్రుంగిపోతూ చాటుగా తల్లితో "చూశావా అమ్మా – ఆఖరికి భారతి రానేలేదు'' అంది గద్గదంగా.

''ఆఁ. ఏదో వీల్లేకపోయింది. ఏం చేస్తాం ?" అంటూ చప్పరించేసింది తల్లి.

''కాదులే అమ్మా. అది రావాలనుకుంటే వచ్చేదే. ఈ నాలుగేళ్లుగా దాని ముభావాన్ని సహించటం నా కెంత కష్టంగాఉందో నీకర్థం కాదు;'' అంటూంటే సత్యవతి కళ్ళలో నీ రాగలేదు.

"అదేమిటే, తప్పుకాదూ ? శుభమా అంటూ కూతురుపెళ్ళి చేసుకుంటూ కళ్ళనీరెట్టుకుంటావా ? రాకపోతే పోయింది. అసలు దాని కేమంత ఒంట్లో బాగాలేదని రాసిందికూడా ! మే మంతా లేమా ? అది రాకపోతే వచ్చినలో టేమిటో చెప్పు ?" అంటూ పెద్దకూతుర్ని ఓదార్చబోయింది లలితమ్మ.

"అది ఎవరూ పూడ్చలేని లోటమ్మా. ఎంతమంది వచ్చినా భారతిసమానం కాలేరని నీకూ తెలుసు. లగ్నంవేళకన్నా తప్పక వస్తుం దని ఇంతవరకూ ఎంతో ఆశతో ఎదురుచూశాను......." అని సత్యవతి ఇంకా ఏదో చెప్పబోతూంటే లలితమ్మ ఆపి "నీ దంతా చోద్యమే. లేనిపోనివన్నీ కల్పించుకుని ఆరాటపడిపోతావ్ ! అదిగో పిలుస్తున్నారు, కళ్ళు తుడుచుకో" అంటూ మాట తప్పించేసింది సత్యవతి. తెచ్చిపెట్టుకున్న నవ్వుతో అందర్నీ పలకరిస్తూ హడావిడిగా పనులు చూసుకోసాగింది.

* * *

పెళ్ళి జరిగిన వారంరోజుల్లో సందడంతా తగ్గిపోయింది. ఒక్కొక్కరుగా చుట్టాలంతా వెళ్ళిపోయారు. సత్యవతి తల్లిదండ్రులు ఓ వారంరోజులుండి వెళ్ళారు. సత్యవతి ఆఖరి చెల్లెలు కామాక్షి మాత్రం సెలవులు గనుక అక్కడే ఉంది. భారతి రాలేదన్న ఆవేదన తగ్గని సత్యవతి ఒకరోజు ఆపుకోలేక కామాక్షితో అంది.

"భారతిని చూసి ఎన్నిరోజులయిందో ! కళ్ళలో మెదులుతోంది. ఇలాగైనా చూస్తాననుకున్నాను."

అసలు సత్యవతి ఇంతగా బాధపడటానికి తగిన కారణం ఉంది. సత్యవతికి భారతి అంటే ప్రాణం. భారతి పుట్టాక తల్లికి చాలా జబ్బు చెయ్యటంవల్ల చిన్నప్పటినుండీ ఆమే పెంచింది. పెద్దక్క అవటంవల్లనూ తల్లిలా చూసుకోవటం వల్లనూ భారతికూడా అక్కయ్యంటే ఎనలేని ప్రేమా, అభిమానమూను.

"తను రాదని తెలుసు నాకు" అన్న కామాక్షి మాటలతో ఉలిక్కిపడింది – సత్యవతి ఆశ్చర్యంతో.

"ఏం ? నీ కెలా తెలుసు ?" అంది ఆత్రంగా. అంతలో బయటినుండి వస్తున్న సత్యవతిభర్త సుందర్రావును చూసి–

"మళ్ళీ చెపుతాలే అక్కా" అంటూ పైకి లేచింది కామాక్షి.

భర్త రాకను గమనించికూడా పైకి లేవలేకపోయింది సత్యవతి. కామాక్షి మాటకు అర్థం మేమిటి? ఏం తెలుసు నామెకు ?

* * *

సత్యవతికి పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళేసరికి భారతి ఆరేళ్ళపిల్ల. భారతిని వదిలివెళ్ళటం సత్యవతి తరం కాలేదు. తల్లినీ, తండ్రినీ బ్రతిమాలుకుని భారతిని కొద్దిరోజులు తనదగ్గర ఉంచుకుంటా నని, ఒప్పించి తనతో తీసుకువెళ్ళింది. కొద్దిరోజులు, కొద్దిరోజు లంటూనే రెండేళ్ళు తన దగ్గర ఉంచుకుని చదువు చెప్పించింది. ఆ తరువాత దూరప్రాంతాలకు బదిలీ కావటంతో భారతిని పంపించెయ్యక తప్పలేదు. అప్పుడు సత్యవతి పడుతున్న ఆవేదన గమనించి సుందర్రావు నవ్వుతూ –

"భారతి నీ చెల్లెలంటే ఎవరూ నమ్మరు. నీ కూతురై పుట్టాల్సింది" అని వేళాకోళం చేశాడు. అతనికూడా రెండేళ్ళుగా ఇంట్లో మసులుతున్న పిల్లను వదిలిపెట్టి వెళ్ళాలంటే కష్టంగానేఉంది. భారతి నెమ్మదైన పిల్ల; తీర్చిదిద్దినట్టున్న కనుబొమలు; నల్లటి పెద్ద కళ్ళు; ఎక్కువగా మాట్లాడకుండానే చురుగ్గా ఉంటూ అందర్నీ ఆకర్షించేది.

దూరంగా బదిలీ అయ్యాక సత్యవతి ఎప్పుడో మూడు నాలుగు సంవత్సరాల కోమారు పుటింటికి వచ్చివెడుతూ ఉండేది. ఇంట్లో పెద్దకూతురి మాటంటే అందరికీ ఎంతో గురి. భారతి ఎస్సెస్సెల్సీ పాసయినపుడు ఇక చదువు చాలించి పెళ్ళి చెయ్యాలన్న తలంపుతో సత్యవతికి రాస్తే ''అంత చిన్నపిల్లకు అప్పుడే పెళ్ళేమిటి ? భారతి చదువుకుంటానంటే కాలేజిలో చేర్పించండి" అని రాసింది సత్యవతి. భారతికూడా నిజానికి చదువుకోవాలన్న ఆసక్తితోనే ఉంది. భారతి కాలేజిలో చేరిన మూడేళ్ళకు గాబోలు సుందర్రావుకు మళ్ళీ మొదటున్న ఊరికే బదిలీ అయింది. అప్పటికి సత్యవతి కూతురు థర్డ్‌ఫామ్ చదువుతోంది. కొడుకు రఘు ఫస్ట్‌ఫామ్ చదువుతున్నాడు.

ఆ మరుసటి సంవత్సరం భారతి అక్కడికే చదువుకోటానికి వస్తుందన్న సంగతి తెలిసి ఇంటిల్లిపాదికీ కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. సుజాతా, రఘూ

శరాణి



'భారతిపిన్ని వస్తుందిరోయ్' అని ఎగిరి గంతులెయ్యసాగారు. సత్యవతికి తృప్తిగా ఉంది.

హఠాత్తుగా వెంకట్రావు గుర్తుకు రావటంతో సత్యవతి గుండెల్లో రాయి పడ్డట్టయింది. మనసులో ఏదో భయం మొలకెత్తింది. మామూలుగా సాయంత్రం వెంకట్రావు వచ్చినపుడు మనసును కలతపెడుతున్న ఆలోచనలనుండి తేరుకుని సత్యవతి అతన్ని పలకరించలేకపోయింది. పిల్లల్తో మాట్లాడుతున్న అతని గొంతు విని కూడా బయటికి రాకుండా ఏదో పని కల్పించుకుంటూ వంటింటోనే ఉండిపోయింది. ''మా పిన్ని వస్తుంది మాస్టారూ'' అని సంభ్రమంగా రఘుచెబుతున్న మాటలూ ఆమె చెవిన పడ్డాయి. వెంకట్రావు వెళ్ళిపోయేముందు వంటింటి గుమ్మం ముందు నించొని—

"ఏమండోయ్ వదినగారూ, చాలా పనిలో ఉన్నట్టున్నారు. ఏమిటీ హడావిడి ? చుట్టా లొస్తున్నారటగా'' అన్నాడు.

సత్యవతి తలెత్తి అతనివేపు చూసింది. అతని కళ్ళు నిర్మలంగా నవ్వుతున్నాయి. వృధాగా అతన్ని అనుమానించి మనసు పాడుచేసుకుంటున్నానా అనిపించింది. కాని భావం ఎంతోసేపు నిలవలేదు. తనను తాను సంబాళించుకుని —

''అవునయ్యా, మా చెల్లి ఇక్కడికి చదువుకోటానికి వస్తోంది'' అంది నీరసంగా.

''చెల్లెలుగారు వస్తున్నా రంటే నీరసంగాఉన్నా రేమిటండీ, సంతోషంగా ఉండాల్సిందిపోయి ? వంట్లో బాగాలేదా ?''

'నీ మూలంగానే. లేక పోతే, భారతి వస్తుందంటే నీరసమా నాకు?' అని మనసులోనే అనుకుని జవాబు చెప్పలేదు సత్యవతి.

"ఇక వస్తానండి" అంటూ బయటికి వెళ్ళిపోయాడు వెంకట్రావు.

సత్యవతి మనసులోని అజ్ఞాతభయం ఆమెను నిలవనీయలేదు. మనసంతా ఆరాటంతో నిండిపోయింది. కాని తన మనసులోని మాట భర్తముందుకూడా చెప్పుకోలేకపోయింది. వెంకట్రావంటే సుందర్రావుకు ఎంత అభిమానమో ఆమెకు తెలుసు. ఆమే ఇంతవరకూ అలాగే ఉంది. ఇప్పుడు హఠాత్తుగా ఇన్ని ఆలోచనలు రావటానికి కారణం లేకపోలేదు. 'తనదాకా వస్తే' అని దీన్నే గాబోలు అంటారు.

సత్యవతి మామూలు స్త్రీ. నీతి నియామాలంటే పడి చస్తుంది. ఎవరేది చెప్పినా వెంటనే నమ్మేసే భోళా మనిషయినా, తనకు నచ్చనిదాన్ని కుండబద్దలు గొట్టినట్టు చెప్పేస్తుంది. ఆమెకు అర్ధంకాని విషయాలను 'నీకర్ధం కాదు' అని చెబితే చెడ్డకోపం వచ్చేస్తుందామెకు.

అందుకే మొదటిసారిగా భర్త వెంకట్రావు గురించి చెప్పినపుడు మండిపడింది. అలాంటివాడు ఈ చుట్టుప్రక్కల ఉండటానికి వీల్లేదంది. తనింట్లో అడుగు పెట్టడానికి సుతరాము ఒప్పుకోనంది. ఆమె ఆవేశపు మాటలన్నీ కానిచ్చి సుందర్రావు శాంతంగా అన్నాడు.

"చూడు సత్యవతీ, మనం రాకముందునుండే అతనా గదిలో ఉంటున్నాడు. మనకిష్టం లేకపోతే మనమే ఇల్లు మార్చాల్సి ఉంటుంది. ఈ మహాపట్నంలో ఇళ్ళు దొరకటం ఎంత గగనంగా ఉందో మనకు తెలిసిందేగా! దీనిపైన నీ ఇష్టం." సత్యవతి కాస్త మెత్తబడి —

"అయితే ఏం చేద్దామంటారు?" అనడిగింది.

"చేసేదేముంది? నాకేమో అతడు అంత చెడ్డవాడుగా అనిపించలేదు. అలాంటివాడయితే తనంతట తను అన్ని విషయాలూ నాతో చెప్పేవాడా? చెప్పకపోతే నాకు తెలిసేది కాదుగదా? చిన్నప్పటి నుండీ ఎవరి ఆప్యాయతకూ నోచుకోలేదేమో. ప్రేమించిన పిల్ల అన్యాయం చేసిపోయేసరికి విరక్తిలో పడి బుద్ధిహీనుడిలా ప్రవర్తించిఉంటాడు."

"ఎవర్తో మోసం చేసిపోయిందని కసపడ్డ ఆడపిల్లనల్లా నాశనం చేయటానికి పూనుకోవడం.....క్రూరంగా, అసహ్యంగా అన్పించటం లేదూ?" సత్యవతి మొహం జేవురించింది.

"ఒకవేపే చూస్తే అలా గనిపిస్తుంది. కాని ఇంకో విధంగా కూడా ఆలోచించి చూడు. చిన్నప్పటి నుండీ తల్లిదండ్రులు లేక, డబ్బుకోసం ఇతన్ని ఆశ్రయించిన బంధువుల కృత్రిమ ఆప్యాయతల మధ్య పెరిగి, హఠాత్తుగా లభించిన ప్రేమ తనదే అనుకుని, ఆ ప్రేమావరణంలో ఆశ్రయం పొందాలని కలవరిస్తున్నపుడు, ఆ కలంతా ఎండమావులని తెలిస్తే ఎలా ఉంటుంది? ఆ సమయంలో అతని బలహీనత కసిగా మారింది. అతను చేస్తున్నది తప్పేకాదనను కాని ఇది జీవితం. అతను స్వభావతః చెడ్డవాడు కాదు. పరిస్థితులు అతన్నలా చేశాయ్. మళ్ళీ మంచి పరిసరాల్లో పడి బాగుపడకూడదంటావా?"

సత్యవతికి భర్త మనసులోని భావం కొంచెం కొంచెంగా బోధపడసాగింది.

"అయితే మీరతన్ని మార్చాలనుకుంటున్నారన్నమాట" అంది తీక్షణంగా.

"మన చేతుల్లో ఉన్నంతవరకూ....."

భర్త మాటను పూర్తి చెయ్యనివ్వకుండా,

"ఉద్ధరించారు... నాకు తెలివితేటలు లేకపోయినా ఇలాంటి ఊబిలో దిగనీయను మిమ్మల్ని," అంటూ విసురుగా అక్కడినుండి వెళ్ళిపోయింది.

కాని ఆమె పంతం సాగలేదు. అకస్మాత్తుగా ఒకరోజు గేటు తెరచుకుని వస్తున్న వెంకట్రావుని చూడటం తటస్థించింది. 'ఇతనేనా?' అని ఆశ్చర్యపోయిందామె. 'పాతికేళ్ళు కూడా లేవతనికి. పసిపిల్లాడిలా అమాయకంగా ఉన్న మొహం. కొంచెం షోకిల్లాలా ఉన్నాడంతే; పాపం, కుర్రవాడింకా' అనుకుంది.

మరో సాయంత్రం భర్తకు కాఫీ ఇద్దామని ముందుగదిలోకి వెళ్ళేసరికి వెంకట్రావు ఉన్నాడక్కడ. ఏదో కబుర్లు చెప్పుకుంటున్నారు. సత్యవతిని చూడగానే నవ్వుతూ.


"నమస్కారం వదినెగారూ" అన్నాడతను.

"అసే..... ఆ గదిలో ఉంటున్నాడే వెంకట్రావు..." అని భర్త ఏదో చెప్పబోతుంటే–

"నాకు తెలుసు" అంది సత్యవతి. ఆమె ఏమయినా అనరాని మాట అనేస్తుందేమోనని భయపడ్డాడాయన. కాని అలాంటిదేమీ జరగలేదు. అసలు వెంకట్రావు మొహం చూస్తే అలా అనబుద్ధెయ్యదెవరికీ. జాలి గొలిపే అమాయకమయిన మొహం – సత్యవతిని చలింపజేసింది. "కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

వెంకట్రావు రోజూ సాయంత్రంపూట ఇంటికి రావడం అలవాటయిపోయింది. సుందర్రావు ఉన్నా లేకపోయినా అతను వస్తూండేవాడు. పిల్లలతో కబుర్లు చెప్పుకుంటూ ఆడుకునేవాడు. వాళ్ళకు రాని లెక్కలో, పాఠాలో చెప్పేవాడు. పిల్లలక్కూడా అతనంటే సరదాగా ఉండేది. కాని సత్యవతి మాత్రం కాఫీ పంపించేసి లోపలే ఉండిపోయేది. భర్త మందలించినా అతనితో చనువుగా మాట్లాడటం ఆమె తరం కాలేదు. అతన్ని తల్చుకుంటేనే, అతని నడత గుర్తుకొచ్చి వళ్ళు గగుర్పొడిచేది. తీరని అసహనంతో ముడుచుకు పోయేదామె మనస్సు.

కాని దానిక్కూడా గండి పడక తప్పలేదు. హఠాత్తుగా జ్వరం వచ్చింది వెంకట్రావుకు. అదే పోతుంది లెమ్మని మాత్రలు వేసుకుని నిర్లక్ష్యం చెయ్యటంతో పరిస్థితి విషమించింది. సుందర్రావు ఎంతో ఇదిగా చూసుకుంటున్నాడు. కాని డాక్టరు ఇది




"గుర్రుపెట్టి నిద్రపోతున్నారుగా గుర్తుంచుకోండి. ప్రొద్దున్నే పొయ్యిలోకి కట్టెలు తేవాలి; చీరెకి డబ్బు ఇవ్వాలి; పనిమనిషికి జీత మివ్వాలి; కరెంటు బిల్లు కట్టాలి; ఇంటావిడకి రెణ్ణెల్ల అద్దె...గుర్తుంచుకోండి."

టైఫాయిడ్ అని చెప్పినపుడు అతని ధైర్యం సడలింది.

"నన్ను హాస్పిటల్లో చేర్చెయ్యండి. మీకు వృథాశ్రమ" అన్న వెంకట్రావు మాటలు అసలే ఆర్ద్రంగా ఉన్న సుందర్రావు మనసును మరింత కరిగించివేసింది. ఇంట్లో కొచ్చి-

"ఇదిగో, వెంకట్రావు మంచం యీ గదిలోకి మారుస్తున్నాను. నువ్వు కాస్త కనిపెట్టి ఉంటానంటే సరేసరి. లేకపోతే నేను శెలవు పెట్టదల్చుకున్నా." అన్నాడు సత్యవతితో. సత్యవతి తెల్లబోయింది. తను వెంకట్రావు పట్ల ముభావంగా ఉంటున్నందుకే భర్త ఇలా కఠినంగా మాట్లాడుతున్నాడని గ్రహించటానికి ఎంతో సేపు పట్టలేదు. వాస్తవానికి ఆమె మనసు అతని విషయంలో యీమధ్య అంత కఠినంగాకూడా లేదు. అతని గదిలోకి వెళ్ళకపోయినా దూరంగా ఉండే, అన్ని సదుపాయాలూ అమరుస్తూనే ఉంది. అందుకే మెల్లగా-

"ఆమాత్రం జ్ఞానం నాకూ ఉంది. చూస్తూ చూస్తూ జబ్బుమనిషిని ఎవరూ వదిలిపెట్టరు. అందులో ఆడవాళ్ళు మీ రనుకున్నంత కఠినంగా ఉండలేరు. మీ రేమంత కంగారు పడక్కరలేదు. మంచి డాక్టర్ని రప్పించండి. మిగతా విషయాలు నాకు వదిలిపెట్టండి" అంది.

సత్యవతి అలా భరోసా ఇవ్వడంతో సగం బరువు తగ్గినట్టనిపించింది సుందర్రావుకు. డాక్టరు మందులూ ఇంజక్షన్లూ ఇస్తూనే ఉన్నాడు. దంపతు లిద్దరూ రాత్రీ, పగలూ రోగిని కనిపెట్టి చూస్తూనేవున్నారు. ఇలా దగ్గరదగ్గర నెలరోజులు జబ్బుతో పోరాడి జయించాడు వెంకట్రావు. అతనికి పథ్యం పెట్టినరోజు మళ్ళా ఇంటికి కళ వచ్చింది. ఇంట్లోవాళ్ళ పాలిపోయిన మొహాల్లోకి వెలుగు వచ్చింది. పథ్యం పెట్టిన వారానిగ్గాని అతన్ని కదలనివ్వలేదు సుందర్రావు.

అయితే ఈ అవధిలో ముఖ్యంగా జరిగిన మార్పు-సత్యవతి మనసులో వెంకట్రావంటే జాలీ, కరుణా, ఆత్మీయతా కలిగి, పెరిగి, పెంపొందింది. అతను జ్వర తీవ్రతతో బాధపడుతూ 'అమ్మా' అని మూలిగినపుడు ఆమె మాతృ హృదయం తల్లడిల్లేది. ప్రపంచంలో తల్లిదండ్రుల, అక్కచెల్లెళ్ళ ప్రేమకు నోచుకోని యీ అభాగ్యుణ్ణి తల్లిలాగే ఆదరించి సేవ చేసింది. పరిణామంగా అతను పూర్తిగా కోలుకునేసరికి అతనిపట్ల ఆమె మనసులో ఏమాత్రం కల్మషం మిగలలేదు. పైగా ఇప్పుడతనితోనే "ఇలాంటి చెడుతిరుగుళ్ళు మానేసి, పెళ్ళి చేసుకోకూడదుటయ్యా?" అనికూడా అనగలుగుతోంది. అతను చిరునవ్వు నవ్వి ఊరుకుంటున్నాడు. జవాబు కోసం మరీ వత్తిడి చేస్తే "నేను ఆ బలహీనతనుండి తప్పుకోలే" నంటాడు. "అబ్బే అదేం లేదు. ఇంకా బోలెడు జీవితం నీ ముందుంది. తల్చుకుంటే బాగుపడగలవు" అంటుంది సత్యవతి. "ప్రయత్నిస్తాలెండి" అంటాడు వెంకట్రావు, ఆమెను తృప్తి పర్చటంకోసం.

"నీ కోపం పోగొట్టటానికే జ్వరం తెచ్చుకున్నాడల్లేఉందే వెంకట్రావు?" అని సత్యవతిని వేళాకోళం చేసేవాడు సుందర్రావు, భార్య మంచితనంమీద అతనికి బాగా నమ్మక ముంది. విధివంచితుడయిన కుర్రవాడు యీ కుటుంబపు స్నేహ, ఆత్మీయతల మధ్య మళ్ళా మనిషవుతాడు అన్న ఆశ అతనిది.

కాని వెంకట్రావు మారలేదు, దానికి మారుగా ఇంట్లోవాళ్ళకి అతని నడతను గురించి పట్టింపు లేకపోయింది. అతని పట్ల సుందర్రావుకి మల్లే సత్యవతికి కూడా జాలి తప్ప మరేభావమూ కల్గటంలేదు. అతనూ ఇంట్లో మనిషిలా మసులుకుంటున్నాడు. ఆదివారాలూ, పండుగపూటా వాళ్ళ ఇంట్లోనే భోంచేస్తాడు. పిల్లలతో ఆడుకుంటాడు. అందరితో సరదాగా కబుర్లు చెబుతాడు. అతని చమత్కారమయిన సంభాషణాధోరణి అందర్ని ఆకట్టివేస్తుంది. కబుర్ల మధ్యలో తన ప్రేమకలాపాల సంగతి కూడా దొర్లిస్తూంటాడు. ఇంతకు మునుపు వింటే అసహ్యించుకునే సంగతులే విని నవ్వేయగలుగుతోంది సత్యవతి.

కాని ఇప్పుడు భారతి వస్తుందంటే గుండె దడదడ లాడుతోంది. భారతి అందమైనది. గుణవతి. తెలివితేట లున్న పిల్ల. కాని వెంకట్రావు ఆడపిల్లలను లొంగదీసుకునే విషయాలు పదే పదే విన్న ఆమెకు అతనిలో ఏదో మాయా, మంత్రం ఉన్నట్టనిపించేది. దానికి భారతి బలి కాకూడదు. కాని ఇప్పు డెలా? భారతిని రావద్దని రాస్తే! కారణం ఏమని చెప్పగలదు?

భారతి రానేవచ్చింది.

ఆ క్షణంలో మనసులోని చికాకు నంతా మరిచిపోయి, అత్తవారింటినుండి ఇంటికి

వచ్చిన కూతుర్ని చూసినంతగా సంబర పడిపోయింది. సత్యవతి తనంత పొడుగూ ఎదిగిన చెల్లెల్ని దగ్గరకు తీసుకుని ఆనందంలో కళ్ళు తుడుచుకుంది. పిల్లలు 'పిన్నీ, పిన్నీ అంటూ భారతిని చుట్టు ముట్టేశారు. సుందర్రావు ఆప్యాయంగా పలకరిస్తూ "ఫో, అక్కను పట్టలేం ఇక" అని వేళాకోళం చేశాడు. కబుర్లూ పరిహాసాల్తో ఇల్లు కళకళ లాడింది.

కాని యీ ఆనందంలో వెంకట్రావు భాగం పంచుకోవటం మాత్రమే సత్యవతిని చికాకు పరిచింది. చెల్లెలి చదువు విషయంలో ప్రత్యేక మయిన శ్రద్ధ తీసుకుంది సత్యవతి. భారతి స్వతహాగా చదువులో బుద్ధి మంతురాలే కాని ఆమె చదువుకు ఎలాంటి ఆటంకాలూ కలక్కుండా, ముఖ్యంగా వెంకట్రావు నీడ ఆమె మీద పడకుండా చూసుకోవటంలో చాలామటుకు సఫలురా లయింది సత్యవతి. తప్పని సరిగా అతను ఉన్నపుడు కబుర్లలో పడితే తనూ వీలు చేసుకుని అక్కడే ఉండిపోయేది. ఒంటరిగా భారతితో మాట్లాడే అవకాశం కలగనీయకూడ దని శపథం పట్టింది. మామూలుగా అతను మాటల్లో అందర్నీ నవ్విస్తూండేవాడు. సహజంగానే భారతి కూడా నవ్వినపుడు సత్యవతి మనస్సులో ముల్లు గుచ్చుకున్న ట్టయ్యేది. ఎపుడెపుడు వెళ్ళిపోతాడా అని కాచుకుని కూర్చుని అతను వెళ్ళగానే హాయిగా నిట్టూర్చేది.

ఓ రోజు భోజనాలపుడు వెంకట్రావు విషయం వచ్చి, సంగతంతా చెప్పాడు భారతితో సుందర్రావు.

"ఛీ! ఛీ! ఇంత అన్యాయమా," అంటూ చీదరించుకుంది భారతి.

''ప్రపంచంలో తప్పు చెయ్యని మానవు డెవడమ్మా? దాన్ని దిద్దుకోవటంలోనే ఉంది గొప్పదనం. ఈమధ్య చాలామటుకు మారి పోతున్నాడు. అదే సంతోషంగా ఉంది నాకు," అన్నాడు సుందర్రావు.

సత్యవతి చికాగ్గా సంభాషణ మార్చేసింది. భారతి అక్కడ లేకుండాచూసి "ఏమిటి మారిపోస్తున్నారు దానికి? లేనిపోని పొగడ్తలు: పైగా మారిపోతున్నాడా! ఎందుకట? ఉద్ధరించాడుగాని, ఏమైతే మన కేం?" అంది కోపంగా.

భార్య అనవసరంగా కోపం తెచ్చుకోవటం చూసి తెల్లబోయాడు సుందర్రావు. తరువాత ఆమె మాటల్లోని భావాన్ని గమనించి తాపీగా "అలాంటిభయం అనవసరం. ధైర్యంగా ఉండు'' అన్నాడు.

''భయమా? భయ మెందుకు? నా కేం భయంలేదు. నా చెల్లి సంగతి నాకు తెలుసు. అల్లాటప్పా పిల్ల అనుకుని దానిజోలికి వెళ్తా డంటే... మొన్ననే కొత్తజోళ్ళు కూడా కొనుక్కుంది, దవడపళ్ళు రాలిపోగలవు." సత్యవతికి కళ్లు క్రోధంతో ఎర్ర బడ్డాయి.

ఈ సంభాషణ చాటుగా భారతి చెవిన పడింది. ఒక విధంగా సత్యవతి ప్రవర్తన భారతిని వెంకట్రావుగురించి ఆలోచించేలా చేసింది.

రానురాను వెంకట్రావు అందరి కళ్ళూ తప్పించి, భారతివేపు చూడటానికి ప్రయత్నిస్తున్నాడు, ఆమె కాలేజి విషయాలు అడిగి ఆమెను కబుర్లలోకి దించటానికి ప్రయత్నిస్తున్నాడు. భారతి స్వతహాగా మిత భాషిణి. అడిగినదానికి ఒక్క ముక్కలో జవాబు చెప్పి ఊరుకునేది. పైగా వెయ్యి కళ్ళతో కనిపెడుతున్న సత్యవతిముందు అతని ఆట లేం సాగటంలేదు. కాని తాను అనుకుంటున్న ప్రమాదం దాపురించిం దని తెలుసుకోవడంతోనే ఆమె మనసు విరిగి పోయింది. పాముకు పాలుపోసి పెంచి నట్టు అనికూడా అనుకుంది. ఇతనికోసం పడిచచ్చే అమ్మాయిలతో భారతినికూడా జమకట్టటానికి ప్రయత్నించటం ఆమె కోపాన్ని అవధులు దాటేట్టు చేసింది. తన ఇంటికి వచ్చిన చెల్లెలికి అంతటి అవమానం జరగటం ఊహలోకూడా సహించలేక పోయింది. 'లేదమ్మా లేదు. నీ కంతటి అవమానం జరగనీయను' అని మనసులోనే చెల్లెల్ని ఓదార్చింది. ఆమె అప్రమత్త మయిన కాపలాలో వెంకట్రావుకు భారతి దర్శనమే దుర్లభ మవసాగింది.

ఇంతలో అనుకోని ప్రమాదం సంభవించింది.

సుందర్రావు చెల్లెలు సీతమ్మకు సీరియస్‌గా ఉందని కబురు రావటంతో బయ లేరక తప్పలేదు. భారతిని వదిలి వెళ్ళటం సత్యవతికి ఏమాత్రం ఇష్టం లేకున్నా తనతో తీసుకువెళ్ళటం అంతకన్నా హాస్యాస్పదం అవుతుం దన్న భావంలో ఊరుకోవాల్సి వచ్చింది. అక్కడికీ—

"పిల్లల్ని వదిలి ఎలా వెడతాం? పోనీ అందరం వెడితే...'' అంది.

''నీ కేమయినా బుద్ధుందా? అలాంటి చోటికి అందరం వెడతామా? లేకపోతే నువ్వుండిపో, నే నొక్కణ్ణే వెడతాను," అన్నాడు సుందర్రావు.

విధిలేక పండగా పర్వాల్లో వంటకు సాయంగా వచ్చే వెంకమ్మగార్ని పిలిపించింది సత్యవతి. రెండుపూటలా పిల్లలకి వంట వండిపెడుతూ సాయంగా అక్కడే పడుకోమని చెప్పి బయల్దేరింది.

"కాస్త చూస్తూ ఉండవోయ్ వెంకట్రావ్" అన్న భర్త మాటలకు 'చూడకుండాఉంటే చూసినంత పుణ్యం' అనుకుంది మనసులో. చిత్రంగా అతన్ని తమతో లాక్కుపోతే మ రేగొడవా ఉండదు అన్న ఆలోచనా ఆమె మనసులో మెదిలింది.

అనుకున్నంత త్వరగా ఆమె తిరిగి రావడం పడలేదు. సీతమ్మగారికి జబ్బు నిమ్మళించి, పథ్యం పెట్టటానికి ఇరవై రోజులు పట్టింది. సుందర్రావు ఓ వారం రోజు లుండి వెళ్ళిపోయాడు. సీతమ్మగారు కాస్త లేచి తిరగగలిగేదాకా ఉండి తర్వాత బయలుదేరింది సత్యవతి.

ఇంటి గుమ్మంలో అడుగు పెట్టగానే వెంకట్రావు నవ్వు వినిపించింది. లోపలికి వెళ్ళగానే కన్పించిన దృశ్యం ఆమెను

తెల్లబోయేలా చేసింది. అది అంత విపరీతమయిన దేమీ కాదు. వెంకట్రావూ, భారతీ, రఘూ, సుజాతా నలుగురూ కేరం ఆడుకుంటూ, పెద్దగా కబుర్లు చెప్పుకుంటున్నారు. వెంకట్రావు చేతిలో పొగలు కక్కుతున్న కాఫీగ్లాసు ఉంది.

సత్యవతిని చూడగానే... ''ఓ, అమ్మ వచ్చింది" అంటూ రఘూ, సుజాతా పరుగెత్తుకువచ్చి ఆమెను చుట్టేశారు. భారతి వచ్చి ఆమె చేతిలోని మరచెంబూ, సంచీ అందుకుంది. వెంకట్రావు-

"హమ్మయ్య, వదినగారు వచ్చేశారన్న మాట. నిజంగా మీరు లేకపోతే ఇల్లు



ఇల్లులా లేదనుకోండి'' అని నవ్వుతూ కాఫీ చప్పరిస్తూ, "ఇదిగో, మీ చెల్లెలిగారి చేతి కాఫీ ఉంది చూశారూ, అమృతమనుకోండి..." అన్నాడు.

"పంచదార ఎక్కువైంది కాబోలు.'' సత్యవతి ఎంత వద్దనుకున్నా ఆమె కంఠంలో ధ్వనించిన కటుత్వానికి అందరూ ఉలికిపడ్డారు. సత్యవతి పిల్లల్ని విడిపించుకుంటూ గబగబా లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె ఏది జరగకూడ దని అనుకుందో అదే జరిగింది. భారతి అతనితో చనువుగా మాట్లాడటాన్ని సహించలేకపోయింది సత్యవతి. అమాయకురాలైన భారతిని తనవైపు ఆకర్షించుకుని వెంకట్రావు తన్ను సవాల్ చేస్తున్నట్టు ఫీలయింది సత్యవతి. ఆమె ఏ విధంగానూ దీనిని సరిపెట్టుకోలేకపోయింది. వెంకట్రావుమీద ఆమెకు యీ మధ్యకాలంలో కలిగిన మమత యావత్తూ తుడుచుకుపోయింది. దాని స్థానే ఒక విధమయిన ద్వేషభావం తలయెత్తింది.

కాని తన మనుసులో జరుగుతున్న సంఘర్షణ చెల్లెలితో చెప్పే సాహసం కలగలేదామెకు. అభిమానవతి భారతి, తన్ను కించపర్చినట్టుగా భావించి బాధపడుతుందేమో. చెల్లెలి మనసు రవ్వంతైనా బాధపడటాన్ని సత్యవతి సహించలేదు. అందుకే సుటీగా కాక అతనితో ఆడ పిల్లలు చనువుగా ఉండటం ఎంత ప్రమాదకరమో వివరించి చెప్పింది.

వెంకట్రావు మామూలుగా వచ్చేవేళ సాయంత్రం. అతను ఇంట్లోకి వస్తూండగానే "అమ్మాయ్ భారతీ, పైకి వెళ్ళమ్మా. చదువుకోవద్దూ? పరీక్ష లెన్నో రోజులు లేవుకదా!" అనేది సత్యవతి. ఆమెకూడా మొదటిలో అతన్ని పలకరించటం మానేసింది. పరిణామంగా అతని రాక రాను రాను అరుదు కాసాగింది. సత్యవతి 'అమ్మయ్య' అని నిట్టూర్చింది.

కాని ఆ సంతృప్తి ఎక్కువ రోజులు నిలవలేదు. ఓ శుక్రవారం గుడికి వెళ్ళి తిరిగి వచ్చిన సత్యవతికి హాల్లో ఎవరూ కనిపించలేదు. తలుపులు తెరిచే ఉన్నాయి. లైటు వేసింది. భారతిని పిలవబోయి ఆగిపోయింది. భారతి డాబామీద ఉందేమో అనుకుంటూ మెట్లు ఎక్కుతున్న ఆమెకు "వదలండి, వదలండి నన్ను" అంటున్న భారతి గొంతు సన్నగా వినపడింది. గబగబా మెట్లెక్కి పైకి వచ్చింది. మసక వెల్తుర్లో ఆకారాలు కన్పించాయి – భారతి, వెంకట్రావు. ''క్షమించండి" అంటూ ఆమె ముందునుండే వేగంగా నడిచి వెళ్ళిపోయాడు. సత్యవతి చెల్లెలి దగ్గరకు వెళ్ళి భుజంమీద చెయ్యి వేసింది. సన్నగా ఏడుస్తోంది భారతి.

సత్యవతి చెల్లెలి కన్నీరు తుడుస్తూ "ఏం జరిగిందమ్మా,ఏడవకు. అసలు ఆ దుర్మార్గుణ్ణి ఇంతవరకూ రానివ్వటం నాదే పొరపాటు." అంటూఉండగానే ఆమె కంఠం గద్గదమయింది. ''ఇప్పుడే వస్తానుండు'' అంటూ పెద్ద పెద్ద అడుగులు వేస్తూ మెట్లవైపు వెడుతున్న సత్యవతికి ''అక్కయ్యా, అతన్నేమీ అనకు" అన్న భారతి గొంతు వినిపించలేదు.

వెంకట్రావుగదిలో అడుగు పెట్టిన సత్యవతి కళ్ళలో నిప్పులు కురిపిస్తూ ''ఇంట్లో చనువుగా తిరగ నిచ్చినందుకు బాగానే కృతజ్ఞత చూపించావు. పాముకు పాలుపోసి పెంచినట్లయింది మా పని. రేపు నువ్వే అయినా గది ఖాళీచేసి వెళ్ళాలి; లేకపోతే మేమే వేరే ఇల్లు చూసుకుంటాం. ఈ ఇంట్లో నీ మొహం చూస్తూ ఉండటం కల్ల" అని అతని జవాబు కెదురు చూడకుండా వెనుదిరిగి వచ్చేసింది సత్యవతి.

మర్నాడు వెంకట్రావు గది ఖాళీ అయింది. అదిచూసి ఆశ్చర్యపోయి అడిగిన భర్తకు తన కేమీ తెలియ దని జవాబిచ్చింది సత్యవతి.

వెంకట్రావు వెళ్ళిపోయాడు. కాని భారతి పరిస్థితేమిటో అర్థంకాలేదు సత్యవతికి. రానురాను నీరసంగా తయారవుతోంది. కళ్ళచుట్టూ నల్లటిగీతలు ఏర్పడ్డాయి. పరధ్యానంగా పుస్తకం చేతితో పట్టుకు ఎటో చూస్తూ కూర్చున్న భారతిని చూస్తే కడుపు తరుక్కుపోయేది సత్యవతికి. అందరిలాంటిదే అనుకుని ఆకర్షించి తన మామూలు ధోరణిలోనే మాట్లాడిఉంటాడు. అంతటి అవమానం సహించగలదా భారతి? ఆమె సున్నిత హృదయం గాయపడి ఉంటుంది. ఈ దెబ్బనుండి కోలుకోగలదా? మొదటిలా అవుతుందా మళ్ళీ? చూస్తూ చూస్తూ ఇంతటి పరిస్థితికి రానిచ్చిన తన్ను తాను క్షమించుకోలేకపోయింది సత్యవతి. ఎక్కడో చదివిన వాక్యం గుర్తుకొచ్చింది ఆమెకు. 'విషసర్పం కుటిలగతిని వింతగా చూస్తున్న నన్నే ఆ సర్పం చివరికి కాటు వేసింది.' ఇపుడామె పరిస్థితి అలాగే అయింది.

ఇక దీనికి ఉపాయం చూడాలి. భారతి మామూలు మనిషవ్వాలి. సత్యవతి భారతిలో ఉల్లాసాన్ని రేకెత్తించటానికి శతవిధాలా ప్రయత్నించింది. "క్లాసు తెచ్చుకోవాలి సుమా, అక్కయ్య ఇంట్లో ఉండి చదువుకున్నందుకు... నీకు క్లాసొస్తే ఆ గొప్ప నాది" అని ప్రోత్సాహంగా మాట్లాడింది. భారతి నిస్పృహయంగా అక్కయ్యవైపు చూస్తూ "నాకు చదువుకోవాలనే ఉందక్కా. కాని...'' అంటూ పూర్తి చెయ్యలేక తల వంచుకుంది. "చదువుకో కేం? నీ క్కాకపోతే ఎవరి కొస్తుం దమ్మాయ్.''

నెమ్మదిగా కోలుకోసాగింది భారతి. పొరపాటునకూడా ఇంట్లో ఎవరూ వెంకట్రావు పేరెత్తకుండా కట్టడిచేసింది సత్యవతి. పరీక్షలు దగ్గర పడుతున్నకొలదీ శ్రద్ధగా చదువుకోసాగింది భారతి. భారతి ఆఖరి పేపర్ రాసివచ్చిన రోజున సత్యవతి కేదో పెద్దభారం తీసేసినట్టయింది.

భారతి ఊరు వెళ్ళిపోయే రోజున ఆ సంవత్సరంలో జరిగినదంతా గుర్తుకొచ్చి ఆవేదనంతా కన్నీటిరూపంతో ప్రవహించింది. "అక్క ఇంటికి వచ్చి ఎంతబాధపడ్డావమ్మా'' అంది చెల్లెల్ని దగ్గరకు తీసుకుని. "నాకేమి టక్కా, బాగానే ఉన్నా. ఇంకా మీరే నామూలంగా...అతన్ని దూరం చేసుకున్నారు."భారతి జవాబు విని చటుక్కున కోపం తెచ్చుకుంది సత్యవతి. "అదేమిటే,

అలా అంటావ్? ఎప్పుడో జరగాల్సింది. నాకే తెలిసిఉంటే ఇంతదాకా వచ్చేదేకాదు. నువ్వేమీ మనసులో పెట్టుకోకమ్మాయ్" అంటూ చెల్లెన్ని ఓదార్చింది.

భారతి వెళ్ళిపోయిన కొద్ది నెలలకు భారతికి ఆ సంవత్సరం పెళ్ళి చేద్దామనుకుంటున్నామనీ, అక్కదేమయినా మంచి సంబంధం ఉంటే తెలుపమనీ సత్యవతి తండ్రి ఉత్తరం రాశాడు.

ఆ తర్వాత కొన్ని రోజులకు సుందర్రావు తెచ్చిన ప్రస్తావన సత్యవతిని ద్రిగ్భ్రాంతురాలిని చేసింది. సుందర్రావు మొదచే– పీఠిక వేసుకుని "నువ్వు కోపం తెచ్చుకోకుండా నేను చెప్పే దంతా పూర్తిగా వినాలి. మధ్యలో మాట్లాడకూడదు" అని వప్పించి తరువాత అసలు విషయం చెప్పాడు.

వెంకట్రావు పేరు రాగానే అన్నీ మరచిపోయి లేచిపోయే సత్యవతి, భర్త మాటకు కట్టుబడి ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుని అంతా వింది.

అతను చెప్పినదాని సారాంశం: "వెంకట్రావు ఇప్పు డెంతో సభ్యుడిగా తయారయ్యాడు. ఆస్తి, చదువు, అందం అన్నీ ఉన్నాయతనికి. భారతిలాంటి పిల్లయితే అతని జీవితాన్ని తప్పకుండా బాగుచెయ్యగలదు. ఈ వివాహం జరగాలంటే నీ సుముఖత చాలా అవసరం."

శాంతంగా బదులు చెప్పటం ఆమె తరం కాలేదు. "ఉండి ఉండి మీరు తెచ్చే సంబంధము ఇదా? బోడిసంబంధం! నా తల్లి కేం తక్కువయిందని? మీ పిల్లనే అయితే అతని చేతిలో పెట్టి నిశ్చింతగా ఉండగలరా? పరాయి పిల్లల్ని నూతిలో దించి లోతు చూసే యీ బుద్ధెప్పటినుండీ? మీ ప్రయోగానికి భారతే కావలసివచ్చిందా! మాణిక్యం లాంటి పిల్లను మర్కటంచేతిలో పెట్టేఊహ వచ్చినందుకే సిగ్గుపడాలి" అంది. ఆమె ఆవేశపు మాటలన్నీ కానిచ్చి సుందర్రావు-

"పోనీ, భారతి ఇష్టపడితే నీ అభ్యంతరం లేదుగా?" అన్నాడు.

సత్యవతి మొహం పాలిపోయింది. పెదవులు వణికాయి. ఉక్రోషంతో, "అమాయకురాలు చెల్లి. దాని కేదో మాయా, మంత్రం వేశాడు. తెలీని పిల్లను ఇంతలా చేసినందుకు ఉరిశిక్ష వేయాలి వాడికి. నా బొందిలో ప్రాణం ఉండగా మీ రన్నది జరగదు. నాముం దీ ప్రస్తావన తేకం డిహ." అని రోదించసాగింది. అంతటితో ఆ ప్రస్తావన ఆగిపోయింది.

ఆ తరువాత సంవత్సరానికి డాక్టర్ మాధవరావుతో భారతి పెళ్ళి జరిగింది. పెళ్ళి పీటలమీద వధూవరులను చూసి ఆనందాశ్రువులు తుడుచుకుంది – సత్యవతి. పెళ్ళి హడావిడంతా తీరిపోయాక ప్రయాణానికి మునుపు ఏదో వెలితిగా ఉన్నట్టనిపించింది. ఈ మధ్య భారతి తనతో మనసిచ్చి మొదటిలా మాట్లాడ లేదన్న సంగతి మొదటిసారిగా గమనించినపు డామె మనసు కలత చెందింది.

"ఏమిటే భారతీ నామీద కోపమా?" అంది.

ఎందుకో తెలియక పోయినా, భారతి చిరునవ్వు ఆమెను సమాధాన పర్చలేకపోయింది. ఆ తరువాత అక్కడున్న వారం రోజులూ చెల్లెలి నిష్టుర మౌన ధిక్కారాన్ని సహించటం ఆమె కెంతో వేదనని కలిగించింది. ఎంత ఆలోచించినా దానికి కారణమేమిటో ఆమెకు తట్టలేదు.

కాని ఊరికి వెళ్ళగానే అన్నీ మరిచి మామూలుగానే ఉత్తరాలు రాసింది. కాని యీ నాలుగేళ్ళలోనూ భారతి ఒక్కఉత్తరం ముక్కా రాయలేదు. ఎన్నిసార్లు రమ్మని రాసినా రానూలేదు. మాధవరావే అప్పుడప్పుడు ఉత్తరాలు రాసేవాడు. చెల్లెలి ముభావం సత్యవతిని ఎంత కష్టపెట్టిందో అందరికీ తెలుసు. ఏది ఏమైనా కూతురు పెళ్ళికయినా భారతిని కలుసుకుంటానని ఎంతయినా ఆశపెట్టుకుంది. అది నెరవేరలేదు. పైగా కామాక్షి మాటల్లోని గూడార్థం తెలియక తీరికగా ఉన్న సమయంలో అడిగింది.

"ఏవిటే అది. భారతి రాకపోవటానికి కారణ మేదో తెలుసన్నావ్?"

"ఏముందిలే అక్కా, నీకూ తెలిసిందే కదా......"

"ఏమిటి నాకు తెలిసింది. నీ మొహం! నాన్చక చెబుదూ!"

"కాదక్కా, నువ్వు మమ్మల్ని తల్లిలా ప్రేమిస్తావు. ఏదయినా మా మంచి కోరే చేస్తావు కాని ఏదయినా నా కక్కర్లేని వస్తువనుకొని దూరంగా పారేసి నాకు ఎంతో మేలు చేశానని అనుకుంటావనుకో; అది లేందే నాకు జీవితమే లేదని నే ననుకుంటాననుకో. అప్పు డేమవుతుంది?"

సత్యవతి సందిగ్ధంగా చెల్లెలి వైపు చూస్తూ "నా కది కావాలని చెబితే పోదుటే" అంది.

"ఎల్లాగా? అది వంటికి పడదని, చిన్నదానివి, నీకు బుద్ధిలేదని విసిరి పారేస్తావు. చిన్నవాళ్ళం నిన్నెదిరించి ఏం పని చెయ్యగలం అప్పుడు?"

సత్యవతి తల తిరిగినంత పనయింది.

"అంటే భారతి వెంకట్రావును ప్రేమించిందా?"

"అవును. అంతేకాదు. అతని కిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయాననీ, మొదటి అమ్మాయిలాగానే మళ్ళీ మోసం చేసి పతనంలోకి దింపాననీ, ఇటు భర్తతో సుఖంగా ఉండలేకపోతున్నాననీ ఎంతో ఇదవుతోంది. దీనికంతా తెలిసో, తెలియకనో నువ్వే కారణంకదా? నీకు మొహం చూపాలనే లేదు తనకు......కాని భారతక్కయ్య సుఖంగా లేదక్కాయ్. నువ్వు మంచికే చేశావ్. కాని అక్కయ్య మనసు కనిపెట్టలేదు. కనిపెట్టి ఉంటే...ప్చ్..." కామాక్షి ఏదో చెప్పుకుపోతోంది. కాని సత్యవతి ఇదేమీ వినటంలేదు.

'భారతి వెంకట్రావుని ప్రేమించింది. భారతి సుఖంగా లేదు. దానికి కారణం తనే. భారతి తన్ను ద్వేషిస్తోంది. మళ్ళీ తన మొహం చూడకూడదనుకునేంత ద్వేషిస్తోంది.'

ఈ ఊహ రాగానే సత్యవతి వణికిపోయింది. ఆమె కళ్ళముందు ప్రపంచమంతా గిర్రున తిరిగిన ట్టనిపించింది. మొదలు నరికిన మానులా క్రింద కూలిపోయిం దామె.